యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుల్లంపేట : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 18 మంది మృతి చెందడం బాధాకరమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఎపిఎండిసి జెసిసి పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ప్రకటించాలని గాయపడిన 40 మందికి మెరుగైన ఉచిత వైద్యం, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని, పరిశ్రమల్లో భద్రత రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాసిరకం బాయిలర్లు, పైపులు, వాడటం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని లేబర్ అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సేఫ్టీ నిర్వహణ విచారణ జరిపి చర్యలు తీసుకోకపోవడం ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో కార్మికులు కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్నారని కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించడం యూనియన్ లేకపోవడం వల్ల సేఫ్టీ గురించి చర్చించడం లేదన్నారు. ఈ భారీ ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ జరపాలన్నారు. మృతులకు నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి రికవ'రీ'!

- పనులు సరే...నిధుల పక్కదారి సంగతేమిటో
- కడప జిల్లాలో రూ.60 లక్షలు దుర్వినియోగం
- అన్నమయ్య జిల్లాలోనూ అయోమయమే
- నేడు మైసూరివారిపల్లి గ్రామసభకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ఉపాధి హామీని నిధుల దుర్వినియోగం వేధిస్తోంది. 2006 ఫిబ్రవరి రెండున అనంతపురం జిల్లా నార్పల మండలం బండపల్లి గ్రామంలో ప్రారంభమైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఏటా సోషల్ ఆడిట్ సక్రమంగా చేయకపోవడంతో వేజ్, మెటీరియల్ నిధుల చెల్లింపుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం ప్రారంభంలో ఆయా పంచాయతీ కార్యాలయాల ముంగిట టెంట్లు వేసి బహిరంగంగా సోషల్ ఆడిట్ నిర్వహించారు. అనంతరం సోషల్‌ఆడిట్ అనే ప్రక్రియ ఒకటి ఉంద నే సంగతే తెలియని పరిస్థితిని కల్పించారు. ఫలితంగా ఏటా వందల కోట్ల ఉపాధి హామీ కేటాయింపుల్లో రూ.కోట్ల పక్కదారి పట్టాయనే విమర్శలు ఉన్నాయి. సోషల్ ఆడిట్ యంత్రాంగం రూ.లక్షలు మాత్రమే పక్కదారి పట్టినట్లు పేర్కొంటోంది. వాస్తవాల్లోకి వెళ్లి లోతుగా పరిశీలిస్తే ఏ స్థాయిలో నిధులు దుర్వినియోగం చేశారనే విషయం తెలుస్తుందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరి వారిపల్లి గ్రామసభకు రానున్న నేపథ్యంలో...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాల్లో ఉపాధి హామీ పనుల్లో వేగం మందగించింది. 2024-25 ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతాంగం సాగు పనుల్లో నిమగ్నమైంది. ఫలితంగా కడప జిల్లాలో రోజుకు మూడు వేల మంది మాత్రమే హాజరవుతున్నారు. కడప జిల్లాలో 2, 22,297 జాబ్‌కార్డులు ఉన్నాయి. 1.90 లక్షలు యాక్టివ్ కార్డులు ఉన్నాయి. 1.38 లక్షల మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 22 నాటికి కడప జిల్లాలో 61 లక్షల పనిదినాలు కల్పించడమైంది. మరో 70 లక్షల అదనపు పని దినాల కల్పనే లక్ష్యంగా ఉపాధి హామీ యంత్రాంగం ముందుకు సాగుతోంది. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లి గ్రామ సభకు హాజరు కానున్నారు. ఉపాధి హామీ పనుల పట్ల అవగాహన కల్పించడం, గతేడాది, ప్రస్తుత, రాబోయే ఏడాదికి ఉపాధి హామీ పనుల ప్రణాళికల్ని సమీక్షించాలనే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పనుల్ని సమీక్షించడం, లోటుపాట్లు సవరించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీని మరింత క్రియాశీలం చేయనున్నారు. జిల్లా పంచాయతీ, డ్వామా జిల్లా ఉన్నతాధికారులు సంయుక్తంగా గ్రామ సభల ఏర్పాట్లు చేశారు. కడప జిల్లాలో 562, అన్నమయ్య జిల్లాలో 501 గ్రామసభల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. కలెక్టర్, డ్వామా, జిల్లా పంచాయతీ అధికారులు ఆయా ప్రాంతాల్లోని గ్రామ సభలకు హాజరు కానున్నారు. వీరందరూ గ్రామసభల్లో ఉపాధిహామీ పనులను దగ్గరగా పరిశీలించి లోటుపాట్లను సవరించే ప్రయత్నం చేయడం గమనార్హం.

జిల్లాలో 19 ఏళ్ల ఉపాధి హామీ పథకం ప్రస్తానంలో 18 సార్లు సోషల్ ఆడిట్ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రూ.60 లక్షలు మాత్రమే పక్కదారి పట్టినట్లు చెబుతుతున్నారు. వాస్తవాల్లోకి వెళ్లి పరిశీలిస్తే రూ.కోట్లు స్వాహా చేశారనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తు న్నాయి. కూలీల స్థానంలో యంత్రా లను ఉపయోగించడం ద్వారా పెద్దఎత్తున ఉపాధి నిధులను స్వాహా చేశారనే విమర్శలు కొల్లలు. అన్నమయ్య జిల్లాలో ఉపాధి నిధుల దుర్వినియోగం చోటు చేసుకుందనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ఉపాధి హామీ నిధులను కొల్ల గొట్టిన వారి నుంచి రికవరీ యంత్రాంగం ఏమి చేస్తు న్నదన్నదనే ప్రశ్న వేధి స్తోం ది. అంబుడ్స్‌మెన్ విభాగం ఎటువంటి విధులు నిర్వహిస్తుందో ఎవరికీ తెలి య డం లేదనే విమర్శ వినిపిస్తోంది. ఇటువంటి అపరిష్కృత సమస్యలను పరిష్క రిస్తేనే ఉపాధి హామీ పథకం మరింత ఉపయోగకరంగా మారుతుందని చెప్పవచ్చు.

శిథిల స్థితిలో బడి..భయం గుప్పిట్లో విద్యార్థులు..!

- ప్రమాదపుటంచుల్లో నడింపల్లి పాఠశాల
- పెచ్చులూడుతూ.. ఉరుస్తున్న గదులు
- భయం భయంగా విద్యార్థుల చదువులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక పంచాయతీ నడింపల్లి ప్రాథమిక పాఠశాల కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో విద్యార్థులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు భయంభయంగా విద్యనభ్యసిస్తున్నారు. వర్షం వస్తే పైనుంచి పెచ్చులు కింద పడుతున్నారు. వర్షం వచ్చిన రోజు స్లాబు ఉరుతోంది. విద్యార్థులు తగతి గదిలో తడుస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో పాఠశాల గదుల నిర్మాణం కోసం నాడు-నేడు కింద నిధులు విడుదలయ్యాయి. రెండు విడతలుగా పనులు జరిగాయి. అయినప్పటికీ పూర్తిస్థాయిలో గదుల నిర్మాణం కాలేదు. కేవలం మొండి గోడలకే పరిమితమయ్యాయి. దీంతో పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 38 మంది విద్యార్థులు చదువుతున్నారు. బలిజపల్లి, నడింపల్లి, దక్షిణగడ్డ దళితవాడ, పత్తూరు వారిపల్లె, మూలపల్లి, మూలవడ్డేపల్లెల నుంచి విద్యార్థులకు ఇక్కడ చదువుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే ఉపాధ్యాయుడే విద్యార్థులందరికీ పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పటికే ఒక ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతిపై వెళ్లారు. పాఠశాల పైకప్పు ఉరుస్తుండడం, పైపెచ్చులు ఊడిపడుతుండడం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్న తరగతి గదులను మరమ్మతులు చేయడమో లేక నిర్మాణంలో ఉన్న గదులను పూర్తి చేసి వాటిలోకి విద్యార్థులను తరలించడమో చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న నడింపల్లి పాఠశాల పైకప్పు

కూలేందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం

ఫోటో కూలడానికి సిద్ధంగా ఉన్న నడింపల్లి ప్రాథమిక పాఠశాల

పిల్లల్ని ఎలా బడికి పంపించేది

ప్రభుత్వ పాఠశాల ప్రమాదకరంగా ఉంటే మా పిల్లల్ని ఎలా పంపించేది. సౌకర్యాలు కూడా సరిగ్గా లేవు. ఒక ఉపాధ్యాయుడే పాఠాలు బోధిస్తున్నారు. వెంటనే విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి.

- ఎస్.రమణ, విద్యార్థి తండ్రి.

మంత్రి దృష్టికి తీసుకెళ్తా

పాఠశాల దుస్థితి గురించి మంత్రి మండిపల్లి దృష్టికి తీసుకెళ్తాను. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదు.

- గాలివీటి నారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్.

పిల్లలు బయట కూర్చునే పరిస్థితి

వర్షం వస్తే పిల్లలను బయట కూర్చునే పరిస్థితి ఏర్పడింది. సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. నాడు- నేడు కింద రెండు విడతల్లోనూ పనులు పూర్తి కాలేదు.

బండి హరి, ప్రధానోపాధ్యాయుడు.

వారం రోజుల్లో అందుబాటులోకి ఇసుక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట వాసులకు బుడుగుంటపల్లె కేంద్రంగా వారం రోజుల్లోపు ఇసుక అందుబాటులోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుడుగుంటపల్లెలో మూడు ఇసుక పాయింట్లలో 5 లక్షల 15 వేల 700 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. వారం రోజులలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మధ్యవర్తులకు అవకాశం లేకుండా ఇసుక రీచ్‌కు దగ్గరలోని సచివాలయంలో వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవాలని, సంబంధిత రసీదును స్టాక్ పాయింట్ వద్దకు తీసుకెళ్లి ఇసుక తెచ్చుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలతో పాటు పోలీసులతో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇసుకను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని, కేవలం కూలీలు, రవాణా ఛార్జీలు మాత్రమే ప్రజలు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న గ్రామసభలకు ప్రజలు సహకరించాలని, ఏ గ్రామ పరిధిలో జరిగే సభలకు ఆ గ్రామం నుంచి మాత్రమే ప్రజలు పాల్గొనాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అనుమతి ఉండదని తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఉచిత ఇసుక విధానానికి విఘాతం : సిపిఎం

కమ్మగడ్డ ఎక్స్ టెన్షన్‌లో నిల్వ ఉన్న ఇసుక డంప్‌ను చూపిస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి మైనింగ్ మాఫియా విఘాతం కల్గిస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని అక్రమ నిల్వలను కనిపెట్టి మీడియాకు చూపించారు. కమ్మగడ్డవీధి ఎక్స్ టెన్షన్ ఏరియా, బసినకొండలో ఉన్న ఇసుక స్థావరాలను చూపించించిన అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ మైనింగ్ మాఫియా డాన్ వాగుల్లో, కుంటల్లో ట్రాక్టర్లతో, బండ్లల్లో ఇసుక ఎత్తనీయకుండా అడ్డుపడటమే కాకుండా లొంగకపోతే కేసులు పెడుతున్నట్లు ట్రాక్టర్ల యజమానులు, చిన్న చిన్న ఇంటి యజమానులు వాపోతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో ఇసుక ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని, అందుకే ఉచిత ఇసుక విధానం తెచ్చినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుకను కొల్లగొట్టిన వారితోనే జతగట్టిన మైనింగ్ మాఫియా డాన్ మరింత రెచ్చిపోయి ఇసుకను, మట్టిని తరలించి అక్రమంగా నిల్వలు చేసుకుని ప్రజలకు చిక్కకుండా చేయడమే కాకుండా గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని వివరించారు. ఆర్‌జె.వెంకటేష్ లాంటి నాయకులు మైనింగ్ అరికట్టడంలో ముందు బాగానా ఉండాల్సింది పోయి మాఫియాకే అండగా నిలబడటమే కాకుండా ఇసుక ప్రజలకు దక్కకుండా చేస్తున్న మాఫియాపై పోరాడుతున్న సిపిఎంపై నిందలు వేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కాపాడుకుంటారో మైనింగ్ మాఫియాకు దాసోహం అవుతారో తెలుగుదేశం శ్రేణులు ఆలోచించాలని కోరారు. మైనింగ్ మాఫియా అరికట్టే వరకు సిపిఎం పోరాడుతుందని, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి ఇసుక దొరకడం లేదని, బెంగుళూరుకు తరలించుకునే వ్యాపారులకు మాత్రం వందల లోడులు ఉంటుందని విమర్శించారు. ఇసుక అక్రమ స్థావరాలను సిపిఎం గత మూడు రోజులుగా బహిర్గతం చేస్తున్నా అధికారులు స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్ పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : పేదలకు నిరంతరం మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసి పంపించాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు డాక్టర్లకు సూచించారు. గురువారం ఆయన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.ఎస్ రాజు, డాక్టర్లతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేదవారు ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలంటే జీవిత కాలం సరిపోదని, అలాంటి వారికి ప్రభుత్వ ఆసుపత్రి వరం లాం టిదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందిం చాలని ఆయన వారికి సూచించారు. **టిడిపి కార్యకర్తకు పరామర్శ** : అనంతరం గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్త రామారావు నాయుడును పరామర్శించి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు కార్యక్రమంలో వైద్యులు మాధవ రెడ్డి, అనిల్ కుమార్, కల్లుగీత కార్మిక మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, చమర్తి మహేష్ రాజు, టిడిపి మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, పార్టీ సీనియర్ నాయకులు మిట్టమీద పల్లె నాగేశ్వర నాయుడు, శేషారెడ్డి, విజయకుమార్, నాగేంద్ర తులసి, రామ్మోహన్ పాల్గొన్నారు.

30 నుంచి టార్గెట్ బాల్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి : ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు రాయచోటి పట్టణంలో టార్గెట్ బాల్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు గురువారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని గ్రామపంచాయతీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జిల్లా అధికారులు అనుమతి కోరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో టార్గెట్ బాల్ పోటీలు సంతోషకరమన్నారు. ఇంకా ఇలాంటి క్రీడా పోటీలు రాయచోటి ప్రాంతంలో నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ ప్రైమ్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 18 మంది కార్మికులు మృతి చెందడంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యం గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు కమిటీల పేరుతో హడావుడి చేస్తున్నారే తప్ప కంపెనీల భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఉన్న లోపాలపై కార్మికుల, తదితర శాఖలు నిరంతరం తనిఖీలు చేయడం లేదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించేటట్లు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్యూచర్ మైండ్స్ విద్యార్థుల బాలవిహార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు గురువారం కడప నగరంలోని రేడియో కేంద్రంలో బాలవిహార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నందకిషోర్ మాట్లాడుతూ బాలవిహార్ కార్యక్రమంలో భాగంగా తమ విద్యార్థులు వివిధ అంశాలపై ప్రసంగించారని తెలిపారు. హత్యరాల శైవ క్షేత్రం, అన్నమాచార్య సంకీర్తనలు, నీతి కథలు, దేశభక్తి గేయాలు, పొడుపు కథలు, సామెతలు వంటి అంశాలపై ప్రసంగించారని అన్నారు. 'మట్టి గణపతి-మన గణపతి' అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతినే వినియోగించాలని సూచించారు. ప్రత్యేకించి ఎల్‌కెజి విద్యార్థి జటిన్ ప్రతిజ్ఞ అందర్నీ ఆకట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజిత, అనుపమ, వరలక్ష్మి, శివశంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

కడప రేడియో స్టేషన్‌లో ఫ్యూచర్ మైండ్ పాఠశాల విద్యార్థులు

సమావేశంలో మాట్లాడుతున్న సుభిరామన్

'మిట్స్'లో సిఎస్ఇ సొసైటీ చాప్టర్ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఐఇఇఇ రెలిబిలిటీ సొసైటీ చాప్టర్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అబుదాబిలోని సిపేఎక్స్‌లో డేటా ప్రొటెక్షన్, రెస్పాన్సిబుల్ ఎఐ ప్రాక్టీస్ లీడ్ సుభిరామన్ మణివనన్ ఐఇఇఇ రెలిబిలిటీ సొసైటీ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఐఇఇఇ మెంబెర్ షిప్ చాలా ముఖ్యమని, విద్యార్థులు ప్రతి ఒక్కరు మెంబెర్‌లుగా స్వీకరించాలన్నారు. ఐఇఇఇ అనేది మానవాళి ప్రయోజనం కోసం సాంకేతికతను అభివృద్ధి చేయడానికి అంకితమైన ప్రపంచంలోనే అతిపెద్ద సాంకేతిక వృత్తిపరమైన సంస్థ అని పేర్కొన్నారు. ఐఇఇఇ, అందులోని సభ్యులు ప్రచురణలు, సమావేశాలు, సాంకేతిక ప్రమాణాలు, వృత్తిపరమైన విద్యా కార్యకలాపాల ద్వారా గ్లోబల్ కమ్యూనిటీని పెంచేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత టెక్నాలజీ డెవలప్మెంట్‌కు తగట్టుగా విద్యార్థులు మెదగడానికి ఇది చాలా ముఖ్యమన్నారు. మల్టీ డిసిప్లినరీ పరిశోధనలు దేశ అభివృద్ధికి ఎంతో అవసరమని, విద్యార్థులు వీటిపై దృష్టిపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఎస్.కుసుమ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-మదనపల్లి

మండలంలోని మదనపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో గురువారం నిర్వహించిన క్వారీ లీజు ప్రజాభిప్రాయ సేకరణ అభ్యంతరాల మధ్య సాగింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కేవల తూతూ మంత్రంగా ప్రజలకు భిన్నంగా మండలంలోని కోటవారిపల్లె సమీపంలో జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా రెవెన్యూ అధికారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి, మదనపల్లె తహశీల్దార్ ఖాజాబీ హాజరయ్యారు. మదనపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 350 50లో 6.70 సెక్టార్ల క్వారీకు సంబంధించి ఓ క్వారీ కంపెనీ లీజుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. జిల్లా అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ తెలుసుకునేందుకు నిర్ణీత క్వారీ సమీపంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడ క్వారీ ఏర్పాటుకు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. గతంలో ఇదేవిధంగా వారి ప్రజాప్రతి సేకరణలో.. ఇచ్చిన హామీలు వారి యజమాన్యం అమలు చేయలేదని ధ్వజ మెత్తారు. నిత్యం లారీల రాకపోకలతో రోడ్లు ధ్వంసం అయ్యాయని, పొలాల్లో మట్టి, క్వారీ పొడి, దుమ్ము ధూళితో పంటలు పండక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక రైతులు వాపోయారు. ఈ సమావేశానికి స్థానికంగా ఉన్న రైతులు, ప్రజలను కాకుండా బయటి ప్రాంతానికి చెందిన వ్యక్తులను అద్దెకు తీసుకొచ్చి సమావేశాన్ని ముగించారని బాధితులు వాపోయారు. మదనపల్లి నుంచి విషయం తెలుసుకొని సమావేశానికి విచ్చేసిన పలు పత్రికలు, టిడి ఛానల్ రిపోర్టర్లకు సైతం అసలైన సమాచారం ఇవ్వలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో భారీ యజమాన్యాలు, జిల్లా రెవెన్యూ అధికారులు చెప్పినట్లు రోడ్లు మరమ్మతులు చేయిస్తామని, క్వారీ పొడి పొలాలకు రాకుండా నెట్లు ఏర్పాటు చేస్తామని, రోడ్లపై దుమ్ము లేయకుండా, అది పొలాల్లోకి రాకుండా ట్యాంకర్లతో నీళ్లు పట్టిస్తామని హామీ ఇచ్చారు. క్వారీ తీసే ప్రాంతాలలో, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి ఇస్తామని చెప్పారు. గ్రామాల్లో పేద పిల్లలకు విద్య, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇవేమీ ఇప్పటివరకు చేయకపోవడంతో క్వారీ తవ్వడానికి వీలులేదని అధికారులను నిలదీశారు. ఇప్పుడేమో అన్ని చేసేస్తామని అధికారుల హామీ ఇచ్చి వెళ్లిపోతారని, తర్వాత ఎవరు ఏమి చేయరని, మేము ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోరని, సమావేశానికి హాజరైన స్థానికంగా ఉన్న కొందరు ప్రజలు తమగోడు విన్నవించుకున్నారు. ఈ సమావేశానికి ఎక్కువ మందిని బయట నుంచి మహిళలు, విద్యార్థులు, పిల్లలను తీసుకురావడంపై స్థానికంగా అభ్యంతరం వ్యక్తం అయింది. మొత్తం మీద తీసుకుంటే, అభ్యంతరాలు, వ్యతిరేకత మధ్య సమావేశాన్ని మమ అనిపించారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బ్యాంకును ప్రారంభిస్తున్న డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి : డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి-రామాపురం

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే బ్యాంకులకు మంచి గుర్తింపు లభిస్తుందని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు గురువారం మండల కేంద్రమైన రామాపురంలో నూతనంగా యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే బ్యాంకుల ముఖ్య ఉద్దేశం అని అన్నారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ లక్ష్మీ తులసి మాట్లాడుతూ ప్రతి ఖాతాదారునికీ నమ్మకమైన సేవలు అందించడమే బ్యాంకుల లక్ష్యమని చెప్పారు. డ్వాక్రా సంఘాలకు రూ. 20 లక్షల వరకు రుణాలు ఇవ్వగలమని చెప్పారు సీనియార్టీ ప్రకారం రుణాలు అందుబాటులో ఉంటాయని, రామాపురంలో ప్రారంభించిన బ్యాంకులో వ్యక్తిగత, వ్యవసాయ, బంగారు రుణాలు వంటివి అందిస్తామని చెప్పారు. ఇప్పుడున్న బ్యాంకులలో వడ్డీ రేట్లు డిపాజిట్లపై ఎక్కువగా ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారి కరీముల్లా, రామాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ లోకనాథ్, అధికారులు ఆదిత్య దామోదర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, ప్రదీప్, వెలుగు సిసిలు నాగభూషణ్ రెడ్డి, ఆదినారాయణ, ప్రసాద్ నరసింహులు, నాగరాజు, వెలుగు ఆనిమేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దివ్య తెలిపారు. ఈ గ్రామ సభలకు పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్‌లు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఉద్యోగులు, పిఆర్ ఎఇ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ, సిరికల్చర్ డిపార్ట్మెంట్, పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ సిబ్బంది హాజరవుతారని తెలిపారు. ఉపాధి పథకం కింద కొత్త పనులు గుర్తించు కార్యక్రమం అన్ని గ్రామాలలో నిర్వమిస్తామన్నారు. ఈ గ్రామ సభలలో కొత్త పనులు గుర్తించుట, సామాజిక తనిఖీ గురించి, ఉపాధి హామీ కూలీల గురించి, ఇప్పుడు జరుగుతున్న పనులు ఏ స్థితిలో ఉన్నాయో వాటి గురించి చర్చిస్తారని పేర్కొన్నారు. **కలకడ:** మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు దొడ్డిపల్లి, ఎర్రకోటపల్లి, దేవులపల్లి, బాలయ్యగారిపల్లి, నడమిచర్ల, ఏనుగొండపాలెం, పంచాయతీలలోనూ, 12 గంటలకు కలకడ, నవాబుపేట, ముడియంవారిపల్లి, కోన, దిగుతాండ పంచాయతీలల్లో, రెండు గంటలకు గంగాపురం, గుడిబండ, కదిరాయ చెరువు, రాతికుంటపల్లి, బాటవారిపల్లి, పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామ సభలో పంచాయితీల అభివృద్ధి నిధుల ఖర్చులపై చర్చిస్తామని తెలిపారు.

ఉచిత ఎముకల సాంద్రత పరీక్ష చేస్తున్న వైద్యులు

ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో గురువారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. బెటర్ లైఫ్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి, పంచకర్మ సెంటర్ ఆయుర్వేద డాక్టర్లు డాక్టర్ వి.దివ్య, డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో జండు కంపెనీవారి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 165 మందికి ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్ష చేశారు. పరీక్షించిన వైద్యులు బాధితులకు వాడాల్సిన మందులను రాసిచ్చి, ఎముకల పటిష్టతకు తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో జండు కంపెనీ శ్రీనివాసులు, ఏరియా సేల్స్ మేనేజర్ ఎగ్జిక్యూటివ్ టెక్నీషియన్ రోహిల్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్బిఐ విశ్రాంత ఆఫీసర్ జి.సామిరెడ్డి, ఎ.మునివెంకటప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి హరీంద్రశర్మ, జి.సునంద, దినేష్ పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి : పశు బీమా పథకం పాడి రైతులకు వరంలాంటిదని, ఈ పథకాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అటువంటి పాడి రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి, వారికి అండగా నిలబడడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తున్నాదని తెలిపారు. పాడి రైతులు పెంచుకొనే పశువులు అనారోగ్య సమస్యలతో ఆకస్మికంగా మరణించినట్లయితే, పశు బీమా పథకం వారికి అండగా నిలుస్తుందన్నారు. పశువులకు పశు బీమా లేకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. పశు బీమా పథకానికి ప్రతి పాడి రైతు అర్హులన్నారు.

రూపానందరెడ్డికి కేక్ తినిపిస్తున్న చిరంజీవి అభిమానులు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : పట్టణంలోని టోల్గేట్ సెంటర్‌లోని ఇంద్ర బస్సు షెల్టర్ వద్ద మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి కేక్ కట్ చేసి అభిమానులకు కూటమి నాయకులకు తిని పించారు. ఈ సందర్భంగా రూపా నందరెడ్డి మాట్లా డుతూ సినిమా రంగంలో చిరంజీవి నటన అద్భు తమని ప్రశంసించారు. నిజ జీవితంలోనూ ఆయన సేవాగుణం కలిగిన వార న్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగేంద్ర, చంద్రశేఖర్, వెంకటేష్, సర్పంచ్ కారుమంచి సంయుక్త, నాగరాజ, జోగినేని మణి,సాయి, మహేష్, కొండేటి వెంకటరమణ, చలపతి, భాను ప్రకాష్, నవీన్, హేమరాజ్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం నూకనపల్లె గ్రామ పంచాయతీ మసీదు వీధి లో నివాసం ఉంటున్న వెండికట్ల అలీ సాబ్ గారి కుమారుడు వెండికట్ల మస్తాన్ కి చెందిన పాస్ పోర్ట్ జూలై నెల 10 వ తేదీ న గొల్లపల్లి నుంచి చిట్వేల్ కు బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో నాకు చెందిన ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్ **U141508** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 6302542282 మొబైల్ నెంబర్ కు గాని తెలుపగలరు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి - పుల్లంపేట

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం ప్రకటించిన 848 జగనన్న కాలనీ ఇళ్లను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో బిల్లులు సకాలంలో అందవన్నారు. 149 ఇళ్ల బేస్ మట్టం లెవెల్‌లో ఉన్నాయని తెలియజేశారు. సొంత స్థలం కలిగిన 413 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. విద్యాశాఖ అధికారి తిరుమలరావు మాట్లాడుతూ ఎంపిపి కృషి వల్ల ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో ఉన్న కంపచెట్లను భారీ గుంతలను పూడ్చామని తెలిపారు. ఎమ్మెల్యేను ఆదర్శ పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయవలసిన సమస్యల గురించి తెలియజేశారు. నాడు-నేడు పాఠశాలల్లో దాదాపు పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో 450 మంది పిల్లలు ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపారన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారి దినేష్ మాట్లాడుతూ బావికాడపల్లె, రామాపురం రెండు పంచాయతీల్లో పంచాయతీ సర్పంచ్‌లు లేనందు వల్ల 14 ఫైనాన్స్ నిధులు విడుదల కాలేదని అక్కడ నీటి సమస్యల తలెత్తుతున్నాయని పేర్కొరు. పిహెచ్‌సి డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే ఎఎన్ఎం గడపగడపకు తిరిగి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆరోగ్యం పట్ల గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రానున్న శీతాకాలంలో ప్రజలు అనారోగ్య పాలు కాకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఎంపిపి బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ నూకనపల్లి వద్ద చెరువు పూడిక తీత పనులు గత ప్రభుత్వ హాయం నుంచి తన సొంత నిధులే వెచ్చిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో నీటి సమస్య ఎదురైతే పంచాయతీ సర్పంచ్ కచ్చితంగా చొరవ తీసుకొని రిపేర్ చేపించాలని నీటి సమస్య బాధ్యత సర్పంచిదేనని పేర్కొన్నారు. రానున్నది శీతాకాలం కాబట్టి ఆరోగ్య సిబ్బంది పంచాయతీ సర్పంచ్‌లు ప్రతి గ్రామంలో సానిటరీ నిర్వహించాలని పేర్కొన్నారు. ఎగో రెడ్డిపల్లి నుంచి ఆర్.రాచపల్లి వరకు రోడ్డును వేయించాలని ఎమ్మెల్యేని కోరారు. దొడ్లోపల్లి నుంచి చిన్నంపల్లి వరకు కూడా రహదారిని వేయించాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రతి ఒక్కరికి సహాయం చేస్తుందని కూటమి ప్రభుత్వం నుంచి ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగదని పేర్కొన్నారు. మండలంలో నీటి సమస్య రాకూడదని ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే పైఅధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గీతా రామనాథం, వైస్ ఎంపిపి జై శంకర్ నాయుడు, ఎంపిడిఒ ప్రకాశం, తహశీల్దార్ కిషోర్ కుమార్, ఆర్ఐ నవీన్ కుమార్, ఎఒ ఖాన్, ఎంఇఒలు చక్రధర్రాజు, తిరుమలరావు, ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, విద్యుత్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పిఆర్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్, ఉపాధి హామీ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఆరోగ్య సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది, కో-ఆప్షన్ నెంబర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20లు చెల్లించి రూ.రెండు లక్షల బీమా పొందండి

- ఎపిజిబి మేనేజర్ ఇంతియాజ్

ప్రజాశక్తి-రామాపురం

రూ.20 ప్రమాద బీమా చెల్లించి రూ.2 లక్షల ప్రమాదబీమా పొందవచ్చని ఎపిజిబి మేనేజర్ ఇంతియాజ్ అన్నారు. మండలంలోని సుద్దమల్ల గ్రామం ఎగువ దళితవాడ చెందిన బుచ్చినపల్లి గోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈనేపథ్యంలో మేనేజర్ గురువారం మృతుని భార్య సుజాతకు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో గోపాల్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.20లు తమ అకౌంట్ నుంచి బీమాకు జమ చేశారని తెలిపారు. మృతుడి భార్యకు రూ. 2 లక్షల చెక్కును అందజేశామని చెప్పారు. గోపాల్ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద రూ. 430 చెల్లించి ఉంటే మొత్తం రూ.4 లక్షలు ఇచ్చేవారమని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో అకౌంట్ కలిగిన ప్రతి ఒక్కరూ పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివైలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రసన్న, నవీన్ బాబు పాల్గొన్నారు.

బాధితురాలికి బీమా చెక్‌ను అందజేస్తున్న బ్యాంగ్ సిబ్బంది

పారిశుధ్య కార్మికుల పర్యవేక్షకుడి తొలగింపు హర్షణీయం

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-పీలేరురు

పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి పారిశుద్ధ కార్మికుల పర్యవేక్షకుడు శ్రీనివాసులురెడ్డిని విధుల నుంచి తొలగించడం హర్షణీయమని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. గురువారం పీలేరులో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులురెడ్డి అవినీతిపై అధికారులు విచారణ జరిపి 20 రోజుల గడుస్తున్నా ఇంతవరకు అతని నుంచి అవినీతి సొమ్ము రికవరీ చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పీలేరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్రకుల పెత్తందారుడైన పారిశుధ్య కార్మికుల సూపర్వైజర్ తన చేతివవాటాన్ని ప్రదర్శిస్తూ సుమారు 8 సంవత్సరాలుగా కొందరు కార్మికులనే పనిలో పెట్టి, వారిపై అదనపు పనిబారం మోపుతూ మరికొన్ని బోగస్ పేర్లతో వేతనం దండుకుంటున్నాడని, గత నెల 29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సుకుమార్‌ను విచారణకు ఆదేశించారు. డాక్టర్ డేవిడ్ సుకుమార్ బృందం ఆగస్టు ఒకటిన పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను, నర్సింగ్ గ్రేడ్ సిబ్బందిని, పారిశుధ్య కార్మికులను విచారించి అవకతవకలు జరిగింది వాస్తవమేనని ధ్రువీకరించారు. ఈ క్రమంలో అవినీతిపరుడైన సూపర్వైజర్‌ను విధుల నుంచి తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. దోచుకున్న సొమ్ము తిరిగి చెల్లింపు విషయంలో సంబంధిత అధికారులు ఆలస్యం చేయడంలో ఆంతర్యం ఏమిటని మరోసారి ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించకుంటే తాము పూర్తి ఆధారాలతో కలెక్టర్, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, పల్లె పోగు హరినాధ, ఎర్రబల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌతం కుమార్

ఎస్‌సి మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

- బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్సీ మహిళలపై దాడి చేసిన అగ్రకులాల యువకులను వెంటనే అరెస్టు చేయాలని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బిఎస్‌పి కార్యాలయంలో బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 18 ఆదివారం సాయంత్రం 4 గంటలకు రామసముద్రం మండలం యంబాడి గ్రామంలో కొంతమంది ఎస్సీ యువకులు వాలీబాల్ ఆడుకుంటుంటే పక్క గ్రామం ఏటవాకిల నుండి కొంతమంది అగ్రకులాల యువకులు మద్యం సేవించి ఆటలో చేరి ఎస్సీ యువకులను బూతులు తిడుతూ దూషించారని తెలిపారు. ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించిన యువకులపై దాడి చేశారన్నారు. ఊరి పెద్ద మనుషులు వచ్చి, వాళ్లు తాగున్నారని గొడవ వద్దంటూ సర్ది చెప్పి పంపించేశాన్నారు. తిరిగి సాయంత్రం సుమారు 6 గంటలకు యంబాడి గ్రామంలోకి వెంకటరమణ, అమర్నాథ్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, మహేష్ రెడ్డి, అమృత్, శివానందలు తమ బైకులపై వచ్చి బండ బూతులు తిడుతూ వెంకటరమణను తీవ్రంగా కొట్టారని తెలిపారు. అంతలో అక్కడే ఉన్న తన వదిన ఆంజమ్మ, తల్లి యశోదమ్మ వారిని అడ్డుకోగా ఆంజమ్మ, యశోదమ్మలపై బూతులు తిడుతూ, కులం పేరుతో దూషించి చీర, జాకెట్లు చింపారన్నారు. అనంతరం రచ్చబండపై కూర్చొని భయభ్రాంతులకు గురి చేశారు. పోలీస్ కానిస్టేబుల్ వచ్చినా అతని మాట వినకుండా తిరగబడ్డారని చెప్పారు. ఎస్ఐ వచ్చిన తరువాత అగ్రకుల యువకులు అక్కడ్నుంచి పరారయ్యారని పేర్కొన్నారు. నాలుగు రోజుల తరువాత కేసు నమోదు చేసిన పోలీసులు ఆ యువకుల్ని అరెస్టు చేయలేదన్నారు. ఈ విషయమై డిఎస్పీ కొండయ్య నాయుడుని అడగ్గా దాడి చేస్తే అరెస్టు చేసేందుకు సెక్షన్లు వర్తించవని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. అగ్రకులాలైన కమ్మ, రెడ్ల ఊర్లలో ఆడవారిపై దాడులు చేసి చీర, జాకెట్లు చింపి ఉంటే డిఎస్పీ ఇదే విధంగా స్పందించేవారా అని సూటిగా ప్రశ్నించారు. దెబ్బలు తిన్నది, అవమాన పడింది ఎస్సీ మహిళలు కాబట్టి వాళ్ళని చులకన భావంతో చూస్తూ నిందుతులను అరెస్టు చేయకపోవడాన్ని విమర్శించారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన డిఎస్పి నిందితుల పక్షాన నిలబడుతూ వారికి కొమ్ము కాస్తూ, అగ్రకుల భావాజాలంతో వ్యవహరించడం సరి కాదన్నారు. మాన్యశ్రీ కాన్షీరామ్ చెప్పినట్లు ప్రస్తుతం కమ్మ-రెడ్ల పార్టీ నడుస్తోందని దానికి ప్రత్యక్ష నిదర్శనంగా డిఎస్పీ కొండయ్య నాయుడు వ్యవహరిస్తున్న వ్యవహార శైలి అద్దం పడుతోందన్నారు. అగ్రకులాల యువకులను అరెస్టు చేయని పక్షంలో రోడ్లపైకి వచ్చి, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. ఎస్పీ కొంత భరోసా ఇవ్వడమే కాకుండా స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కూడా బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డిఎస్పీ కొండయ్య నాయుడు తన అగ్రకుల వ్యవహార శైలి మార్చుకొని, ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర అన్ని కులాల పట్ల సమానత్వ భావంతో మెలగాలని కోరారు. డిఎస్పీ ఏమి సుప్రీం కాదని, పై అధికారులు అలా కాని పక్షంలో హైకోర్టు, సుప్రీం కోర్టులు ఉంటాయని, తమ ఆత్మాభిమానం కోసం, ఆత్మ గౌరవం కోసం ఎంత దూరమైనా వెళ్తామని తెలియజేశారు. అనంతరం గొడవ జరిగిన విధానాన్ని ఆంజమ్మ వివరించారు. కార్యక్రమంలో యంబాడి గ్రామానికి చెందిన వెంకటరమణ, ఆంజప్ప, చంద్ర, శశి కుమార్ మరియు బిఎస్‌పి నాయకులు రమణ, సురేష్, కృష్ణ, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి, ప్రసాద్, శివ అరుణ్, మహేష్, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

శాంతి సమాజ స్థాపనే 'మానవత' ధ్యేయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమాజంలో శాంతిస్థాపనే ధ్యేయంగా మానవత సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందరరేగా, స్థానిక శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులతో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంస్థ నాయకులు మాట్లాడుతూ శాంతి, సామరస్యం, ప్రగతి, ఆనందం కలగలిపిన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆకాంక్షించారు. మానవత సంస్థ పలు సామాజిక సేవా కార్యక్రమంలో ముందు ఉంటుంది. ఉచిత శాంతిరథాలు, బాడీ ఫ్రీజర్ బాక్సు పాఠశాల పిల్లలకు నైతిక విలువలు గల బోధన, కళాశాల విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం మొదలగు సేవా కార్యక్రమాలు చేస్తున్నది. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనిట్ చైర్మన్ ఆర్ గురు ప్రసాద్, డైరెక్టర్ బి నారాయణ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ సి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి రమణప్ప ట్రెజరర్ హరినాథ్ బాబు, మానత సంస్థ సభ్యులు కళాశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మానవత సభ్యులు

మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ప్రిన్సిపల్ మల్లం షావలి

ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి -కలకడ : మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను తనిఖీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మల్లం షావలి తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలు రుచికరంగా ఉన్నాయా లేదా అని స్కూల్ కమిటీ చైర్మన్ కోట రమేష్ వైస్ చైర్మన్ అక్బర్ అలీ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనాలను మెనూ ప్రకారం వడ్డించాలని సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసానిక వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర, పీడీ కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వాట్సాప్ గ్రూప్ ద్వారా అందించిన సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం రోజా ఫ్లాట్స్‌లోని ఇసుక డంప్‌ను తహశీల్దార్ ఖాజాబీ, ఆర్ఐ రెడ్డప్ప సందర్శించారు. ఇసుక తరలింపునకు సంబంధించిన బిల్స్‌ను పరిశీలించారు. 15 ట్రిప్పర్లు ఇసుకను ఏడాది క్రితం ఇంటి నిర్మాణం కోసం తన సొంత స్థలంలో స్టాక్ పెట్టుకున్నట్లు రాటకొండ రమేష్ నాయుడు తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం 15 టిప్పర్ల ఇసుకను స్టాక్ పెట్టుకున్నట్లు తెలిపారు. స్థలం వివాదంలో ఉండడంతో ఇంటి నిర్మాణం ఆలస్యమైనదని వివరించారు.

ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహశీల్దారు

క్రైం కార్నర్

పట్టుబడిన అంతర్రాష్ట్ర ముఠాతో సిఐ యుగంధర్, ఎస్ఐ బాలకృష్ణ

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- మూడు ద్విచక్రవాహనాలు, 5 సెల్ ఫోన్లు, రూ.95 వేలు నగదు, ఆయుధాలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో ఆరుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ పి. యుగంధర్ తెలిపారు. చోరీ కేసులో నిందితులైన వ్యక్తులు గురువారం పీలేరు-మదనపల్లి మార్గంలోని డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్నారని తమకు అందిన రహస్య సమాచారాన్ని రాయచోటి డిఎస్‌పి రామచంద్ర రావుకు సమాచారం అందించి, డిఎస్‌పి ఆదేశాల మేరకు తాను తన సిబ్బందితో కలిసి నిందితులపై దాడి చేసి, వారి నుంచి రూ.95 వేలు విలువ చేసే సుమారు 19 గ్రాముల బంగారు నగలు, 3 మోటార్ సైకిళ్ళు, 5 సెల్ ఫోన్ లు, 6 కత్తులను సీజ్ చేశామన్నారు. అనంతరం ఆరుగురు నిందితులను రిమాండుకు పంపినట్లు చెప్పారు. పీలేరులో చోరీ కేసుల్లో మొదటి ముద్దాయిలైన సాగర్, అతని బావమరుదులైన సాచి, శ్యామ్, పాత గుంతకల్లులోని డోణముక్కలకు చెందిన షేక్ అబ్దుల్ రహమాన్, సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ సలీం, షేక్ మస్తాన్, సయ్యద్ రఫీ, సయ్యద్ హుస్సేన్ బాషలు గత నెల 27న రాత్రి పీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మదనపల్లి రోడ్డులో ఒంటరిగా ఉన్న జహారాబీ అనే మహిళపై దాడి చేసి, ఆమెను గాయపరచి బంగారు నగలను, అదేరోజు రాత్రి పీలేరు మండలం, ఒంటిల్లుకు సమీపంలోని గిరిబాబు నాయుడు ఇంటిలోకి తుపాకులు, కత్తులతో దాడి చేసి పారిపోయారని పేర్కొన్నారు. గత నెల 24న కర్ణాటక రాష్ట్రంలోని గౌనిపల్లి, 25న విజయపుర, నందగుడి పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఇది నిందితులు నేరాలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని సిఐ అన్నారు. ఈ నిందితుల్లో శ్యామ్, సాగర్ మధ్య ఈనెల 9న పాణ్యం సమీపంలో తమ దోపిడీ చేసిన సొమ్ము వాటాల పంపకంలో గొడవ సాగర్ పిస్టల్‌తో శ్యామ్‌ను కాల్చి చంపాడని, ఆ కేసులో సాగర్ జైలుకు వెళ్ళినట్లు తెలియజేశారు. మిగిలిన నిందితులను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి- కలకడ

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు విరాళాలు ఉన్నాయి. మండలంలోని కోనకు చెందిన అఖిల్‌రెడ్డి వద్ద, కడప పట్టణానికి చెందిన డొక్కా తరుణ్ (35) జెసిబి క్లీనర్‌గా పనిచేస్తుండేవాడని తెలిపారు. ఈ క్రమంలో గత నెల క్రితం తరుణ్ తండ్రి మృతి చెందడంతో కడపలో కార్యకలాపాలు ముగించుకుని గత మూడు రోజులుగా తిరిగి కానక చేరుకుని జెసిబి క్లీనర్‌గా పనిచేస్తూ ఉండేవాడని తెలిపారు.అయితే ఈ నెల 21వ తేదీ బుధవారం స్థానిక గ్రామస్తుడైన సయ్యద్ ఖాన్ పొలంలో జెసిబితో పనిచేస్తున్న సమయంలో మ ృతుడు తరుణ్ సయ్యద్ ఖాన్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని బుధవారం సాయంత్రం ఆరు గంటలకు తీసుకెళ్లి నట్టు తెలిపారు. తిరిగి రాత్రి సమయం అయినప్పటికీ రాకపోవడంతో చుట్టుపక్కల వెతికిన ఫలితం లేకపోతే, ఉదయం స్థానిక పాపిరెడ్డిగారిపల్లి-కోన క్రాస్ మధ్యలో ఉన్న హెచ్పి గ్యాస్ గోడౌన్ సమీపంలో మృతి చెంది పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసుల సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. వెంటనే పోలీసులు చేరుకొని మృతుడి వివరాలను కనుక్కొని బంధువులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతుడి అన్న డొక్కా శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ : స్కూటరిస్టు మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా,వారి పరిస్థితి విషమింగా ఉన్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.బి.కొత్తకోట మండలం, కోటావూరు గ్రామం,కాండ్లమడుగు క్రాస్ సమీపంలో ఉన్న అమరనారాయణ పురానికి చెందిన పృధ్వి (25), అతని పినతల్లి కుమారి (45), వరుసకు తమ్ముడూ ప్రేమకుమార్ (12) పాలుపోయడానికి కురబలకోట మండలం, సింగన్నగారిపల్లెకు బైకులో బయలుదేరారు. బైకు మార్గమధ్యంలోని కంటేవారిపల్లె వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో పృథ్వి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుమారి, ప్రేమ్ కుమార్ ఇద్దరికీ తీవ్రగాయాలు కావడంతో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.